క్లుప్తంగా

నేడు హార్టికల్చర్ జాయింట్ డైరెక్టర్ రాక

గార్లదిన్నె: మండల కేంద్రం గార్లదిన్నెలో బుధవారం హార్టికల్చర్ జాయింట్ డైరెక్టర్ దేవముని రెడ్డి పర్యటించనున్నట్లు ఉదాద్యాన శాఖ అధికారి రత్నకుమార్ తెలిపారు.మంగళవారం ఆయన మాట్లాడుతూ హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ సైంటిస్ట్ శ్రీనివాసరెడ్డితో కలసి ఆయన మండ లంలోని బత్తాయి తోటలు పరిశీలించి, గార్లదిన్నె రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహిస్తారన్నారు. బత్తాయి రైతులు హాజరు కావాలని ఆయన సూచించారు.

కసాపురంలో మన్యుసూక్త హోమం


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం మన్యుసూక్త హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ యాగశాలలో ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య మన్యుసూక్త హోమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

కమణీయం.. నారాయణుడి కల్యాణం


ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు సమీపంలో పెన్నానది ఒడ్డున వెలసిన అశ్వత్థం క్షేత్రంలో మంగళవారం పౌర్ణమి సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగించారు. ఈసందర్భంగా భక్తులకు ఆలయ కమిటీ సభ్యులకు అన్నదానం చేశారు. ప్రతి నెలా పౌర్ణమి రోజు కల్యాణం నిర్వహించడం గత కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తోందని ఈఓ సుబ్రమణ్యం తెలిపారు.

గోడ తొలగించాలి


మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఓల్డ్ సీపీఐ కాలనీవాసులు

గుత్తి: పట్టణంలోని ఓల్డ్ సీపీఐ కాలనీలో దస్తగిరి జెండా కట్ట వద్ద కొందరు అక్రమంగా నిర్మించిన గోడను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆ కాలనీ వాసులు మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కాలనీకి చెందిన చాంద్ బాషా, వరిగడ్డి షాషావలి, మాబు తదితరులు సుమారు 20 మంది మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి కమిషనర్ జబ్బార్ మియాతో వాగ్వాదానికి దిగారు. అక్రమంగా గోడ కడుతున్నారని సమాచారం ఇచ్చినా ఎందుకు పట్టించుకోలేదని కమిషనర్‌ను నిలదీశారు. కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ తదితర అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదని, గోడను తొలగించకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని వారు హెచ్చరించారు.

రైతులకు అందుబాటులో ఉండండి


రైతు సేవా కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ రవి

యల్లనూరు: వ్యవసాయాధికారులు రైతులకు నిరంతరం అందుబాటులో ఉండాలని తాడిపత్రి ఏడీఏ రవి సూచించారు. మండలంలోని నిట్టూరు, వెన్నపూసపల్లి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. రైతులకు అందుబాటులో ఉండి తెగుళ్ల సమయంలో వరి, మొక్కజొన్న, కంది, వప్పుశనగ పంటల సమయంలో పంటల నమోదు కార్యక్రమం, తగు సలహాలు, సూచనలు ఇవ్వాలని ఏఓ కిరణ్‌కుమార్‌రెడ్డికి ఆదేశించారు. అనంతరం నిట్టూరు గ్రామంలో మొక్క జొన్న పంట నమోదును ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విష పురుగు కాటుతో రైతుకు అస్వస్థత

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామంలో రైతు రంగయ్యకు మంళవారం విష పురుగు కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. రంగయ్య నడుచుకుంటూ వెళ్తుండగా కాలికి విష పురుగు కాటు వేసింది. కుటుంబసభ్యులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


యాడికి మండలం కేశవరాయుని పేట సమీపంలో వంగిన స్తంభం


రాయలచెరువు, చందన గ్రామాల మధ్యలో ఇలా..


పెద్దపప్పూరు మండలం అత్తిరాలదిన్నె వద్ద పొలంలో ఒరిగిన స్తంభం

ఒరిగిన స్తంభాలు.. వేలాడుతున్న తీగలు

ఈ చిత్రంలోని రైతు పేరు పుల్లారెడ్డి. పెద్దపప్పూరు మండలం అత్తిరాలదిన్నె సమీపంలో పొలం ఉంది. ప్రస్తుతం పత్తి పంట సాగు చేశాడు. పొలంలో విద్యుత్ వైర్లు కిందకి వేలాడుతుండడంతో పొలంలోకి సేద్యం చేయడానికి ట్రాక్టర్ యజమానులను పిలిచినా విద్యుత్ ప్రమాదాలకు భయపడి రాకపోవడంతో కలుపు తీయడం మానుకోవాల్సి వచ్చిందని వాపోయాడు. ఒరిగిన స్తంభాన్ని సరిచేయాలని విద్యుత్ అధికారులకు ఫోన్‌లో వివరించినా పట్టించుకోలేదన్నాడు. ప్రస్తుతం పత్తి పంట కోతకు



వచ్చిందని, ఒరిగిన స్తంభం పడిపోతే పంట పూర్తిగా కాలిపోయే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశాడు.

- పొంచి ఉన్న విద్యుత్ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో అన్నదాతలు

యాడికి/పెద్దపప్పూరు: పంట పొలాల్లో అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ తీగలు అన్న దాతల పాలిట శాపంగా మారాయి. వంగిన స్తంభాలు, వేలాడుతున్న తీగలు, కంచెలు లేని ట్రాన్స్‌ఫార్మర్లు రైతులను కలవర పెడుతున్నాయి..

ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలతో ఎక్కడో ఒక చోట మూగ జీవాలు ప్రాణాలు కోల్పోతున్నా, రైతులు ప్రమాదాలు గురవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. యాడికి, పెద్దపప్పూరు మండలాల్లోని పలు గ్రామాల్లో విద్యుత్ వైర్లు కిందకి వేలాడటంతో ప్రమాదకరంగా మారాయి. రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లాలంటే జంకుతున్నారు. కొన్ని గ్రామాల్లో గత్యంతరం లేక కర్రలను పాతి కిందికి వేలాడుతున్న వైర్లకు సపోర్టుగా ఉంచుతున్నారు. ఏటా వానాకాలం సీజన్‌కు ముందు పొలాల్లో కిందకు వేలాడుతున్న కరెంట్ తీగలు, వంగిన స్తంభాలను సరి చేయాలి. కానీ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో చాలా గ్రామాల్లో మూగ జీవాలు, రైతులు కరెంట్ షాక్‌కు బలవుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి పొలాల్లో ఒరిగిన స్తంభాలు, వేలాడుతున్న తీగలను సరి చేయాలని రైతులు కోరుతున్నారు.

తీగలు సరి చేయాలి



మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయాలి. తీగలు వేలాతుండడంతో పొలాలను దుక్కులు చేసుకోలేకపోతున్నాం. ఇలాగే ఉంటే వర్షాకాలంలో ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుంది. ఈ విషయమై అధికారులు స్పందించాలి.

–దేవేంద్ర యాదవ్,
పుప్పాల గ్రామం, యాడికి మండలం

చర్యలు తీసుకుంటాం

నేను ఈ మధ్యనే ఈగా బాధ్యతలు చేపట్టాను. మండలంలో పొలాల్లో వంగిన స్తంభా వేలాడుతున్న విద్యుత్ తీగలను పరిశీలిస్తున్నాం. వాటిని సరి చేయడానికి ప్రతిపాధనలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపుతాం. వారి నుంచి అనుమతి రాగానే విద్యుత్ లైన్లను మరమ్మతులు చేస్తాం.

– విజేయుడు, ఏఈ ,
యాడికి మండలం

విద్యుత్ ప్రమాదంలో చీనీ చెట్లు దగ్ధం

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్లలో మంగళవారం విద్యుత్ ప్రమాదంలో చీనీ చెట్లు దగ్ధమైన సంఘటన చోటు చేసుకుంది. బాధిత రైతు సురేష్ మాట్లాడుతూ తోటలో బోర్లకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తెగి కింద పడి మంటలు వ్యాపించడంతో దిగుబడికి వచ్చిన చీనీ చెట్లు, పైపులు, డ్రిప్పు వైర్లు కాలిపోయాయన్నారు. దాదాపు రూ.10లక్షలు ఆర్థిక నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పండ్ల తోటల పరిశీలన


మాట్లాడుతున్న డ్వామా పీడీ సలీంబాషా

పామిడి: మండలంలోని ఎద్దులపల్లి, కండ్లపల్లి, సొరకాయలపేట గ్రామాల్లోని పండ్ల తోటలను మంగళవారం డ్వామా పీడీ సలీంబాషా పరిశీలించారు. వాటి నిర్వహణపై సమీక్షించారు. ఉపాధి పనులను పరిశీలించి, కూలీలకు ఈ కేవైసీ రిజిస్ట్రేషన్ నమోదు, వేతనదారులకు పనుల కల్పనపై వివరించారు. ఎంపీడీఓ కే తేజోత్స్న, ఏపీఓ ఆదినారాయణమ్మ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

'పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలి'

గుంతకల్లు రూరల్: విద్యాశాఖలో పనిచేస్తున్న ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం మండల విద్యాశాఖాధికారి మస్తాన్ రావు, సుబ్బరాయుడుకు వినతిపత్రం అందజేశారు. మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు.

విషజ్వరాలపై అప్రమత్తంగా లేకుంటే చర్యలు

యాడికి: విష జ్వరాలపై అప్రమత్తంగా లేకుంటే చర్యలు తప్పవని జిల్లా మలేరియా అధికారి ఓబులు హెచ్చరించారు. మంగళవారం యాడికి, రాయలచెరువులోని పీహెచ్‌సీలను ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులుతో కలసి ఆయా పీహెచ్‌సీల వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్య సిబ్బందితో మాట్లాడారు. వారంలో ఒక రోజు డ్రై డే పాటించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఎంపీహెచ్‌ఓలు రామచంద్ర నాయక్, సీహెచ్‌ఓ జుబేదా బేగం, సూపర్‌వైజర్లు, షబ్బీర్, రాంప్రసాద్ గౌడ్, హెల్త్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు


పెద్దవడుగూరు లో కలశం ఊరేగిస్తున్న దృశ్యం


మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి స్వాగతం పలుకుతున్న ఆలయ కమిటీ సభ్యులు

పెద్దవడుగూరు: మండల కేంద్రం సమీపంలో నూతనంగా నిర్మించిన వీరభద్రస్వామి ఆలయం ప్రారంభోత్సవ వేడుకలు రెండో రోజు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుండి ప్రాతఃకాల పూజలు, యంత్రాలకు అభిషేకాలు, ప్రతిష్ఠ, విగ్రహామూల మంత్రజపాలు, మంగళ హారతి తీర్థప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం మహిళలతో కలశం ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు, ప్రముఖులు, భక్తులు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లుటౌన్: సచివాలయ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకూ దశలవారీగా ఉద్యమాలు కొనసాగిస్తామని ఏపీవీడబ్ల్యూ ఎస్ఈ జేఏసీ నాయకులు రమేష్‌రావు, ఆదినారాయణ, మంజునాథ్ హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా మంగళవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయం ఎదుట సచివాలయ ఉద్యోగులు బైఠాయించి నిరసన తెలిపారు. సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరం కాపాడాలని, వలంటీర్ల పనులు ఆపాలన్నారు. సెలవులు, ఆదివారాల్లో బలవంతంగా పనులు చేయించడం తగదన్నారు. సచివాలయ ఉద్యోగులందరికీ జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్, నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, ఉద్యోగులను మాతృశాఖల్లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకురాళ్లు పుష్పమి, భారతి, ఉద్యోగులు పాల్గొన్నారు.


మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించిన సచివాలయ ఉద్యోగులు

జడ్జిపై దాడి హేయమైన చర్య

గుంతకల్లు:/గుంతకల్లు టౌన్/గుత్తి/గార్లదిన్నె : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సీజేఐ గవాయ్‌పై దాడి హేయమని, ప్రజాస్వామ్య మనుగడకే అవమానమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్ అన్నారు. మంగళవారం పట్టణ సీపీఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మం పేరుతో ఓ మతోన్మాత అడ్వకేట్ రాకేష్ వర్మ సుప్రీం కోర్టు ప్రాంగణంలోనే ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై పాదరక్ష విసరడం దారుణమన్నారు. ఇలాంటివి పునరావృత్తం కాకుండా కఠనంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గోవిందు, మహేష్, గౌస్, రాము, ఈశ్వరయ్య, దేవేంద్ర, దాసరి శ్రీనివాసులు, చిదాంబరం, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే సీజేఐపై దాడి చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం సీపీఎం, అనుబంధ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, సంచారజాతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జడ్జిపై దాడికి పాల్పడిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని గుంతకల్లు న్యాయవాదుల సంఘం డిమాండ్ చేసింది. జస్టిస్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ మంగళవారం న్యాయవాదులు తమ విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జయరామ్, సీనియర్ న్యాయవాది నాగరాజు, కార్యదర్శి రమేష్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సభ్యుడు తిమ్మప్ప, సీనియర్ న్యాయవాదులు రజబ్‌వలి, వెంకట్‌నాయుడు, నాగేషు తదితరులు పాల్గొన్నారు. అలాగే న్యాయవాదిని శిక్షించాలంటూ గుత్తిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ మండల కార్యదర్శి రామదాసు, బీఎస్పీ నియోజకవర్గం అధ్యక్షులు విజయ్ తదితరులు నిరసన వ్యక్తం చేశారు. అదేవిధంగా జడ్జిపై లాయర్ దాడి చేయడం హేయమైన చర్య అని అనంతపురం డివిజన్ ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యులు లోలూరు కుళ్లాయప్ప అన్నారు.


గుంతకల్లులో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

గుంతకల్లు రూరల్/గుంతకల్లు టౌన్/యాడికి: తగ్గిన జీఎస్టీపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని అధికారులు సూచించారు. మంగళవారం గుంతకల్లులోని శంకరనందగిరీ కళాశాలలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డీసీటీఓ శ్రీనివాసులు, ఏసీటీఓ రామకృష్ణ, ఎంపీడీఓ నాగభూషణం, ప్రిన్సిపాల్ వరప్రసాద్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తగ్గిన జీఎస్టీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్ శర్మ, అధ్యాపకులు పాల్గొన్నారు. అదేవిధంగా యాడికి మండలంలోని 10 ప్రభుత్వ , ఆరు ప్రైవేటు ఉన్నత పాఠశాలల విద్యార్థులకు తగ్గిన జీఎస్టీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శశికళ, ఎంఈఓ కాశెప్ప, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ నాగేశ్వర రెడ్డి , ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సీతా రామాంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు


గుంతకల్లులో వాల్మీకి విగ్రహానికి పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ, వాల్మీకి సంఘం నాయకులు


పామిడిలో వాల్మీకి మహర్షి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం


పెద్దవడుగూరులో వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్/గుంతకల్లుటౌన్/గుత్తి/పెద్దవడుగూరు/పామిడి/గార్లదిన్నె/గుత్తి రూరల్/శింగనమల: తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో వాల్మీకి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి విగ్రహానికి ప్రత్యేక అలంకరణలో పూజలు చేశారు. తాడిపత్రి పట్టణంలోని వాల్మీకి సర్కిల్ లో వున్న వాల్మీకి విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుడు మాజీ వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఓబులేసు, గుండన్న, నడిపి రంగడు, సాంబుడు, బ్రహ్మయ్య, హనుమంతు, మధు, పోతులయ్య, రాజ, కంబగిరి తదితరులు పాల్గొన్నారు. అలాగే గుంతకల్లు పట్టణంలోని పాత గుంతకల్లు, కసాపురం రోడ్డులో ఉన్న వాల్మీకి విగ్రహాలకు వాల్మీకి సేవాసమితి పట్టణ అధ్యక్షుడు చాముండేశ్వర, ప్రధాన కార్యదర్శి మాచర్ల యల్లప్ప, కులసంఘం పెద్దలు, వాల్మీకులు పూజలు చేశారు. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాదిలింగేశ్వరబాబు, నియోజకవర్గం యువనేత సి.బి.మంజునాథరెడ్డి, మాజీ చైర్మన్ రామలింగ, పార్టీ సీనియర్ నేత ఎద్దుల శంకర్, నియోజకవర్గం బీసీ, వాలంటీర్ విభాగాల అధ్యక్షులు రంగనాయకులు, వాల్మీకి పవన్, పార్టీ పట్టణ కార్యదర్శి బోయ తిమ్మప్ప, వార్డు ఇన్‌చార్జులు మార్కెట్‌వెంకటేష్, దర్గానాయుడు, మస్తానయ్య, సూరి, హనుమేష్, వసంత్, ప్రభాకర్ తదితరులు వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. అలాగే వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా, కుల సంఘాల నేతలు వేర్వేరుగా వాల్మీకి జయంతి ఉత్సవాలు చేపట్టారు. అలాగే పామిడిలో నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకల్లో వాల్మీకి సంఘం నాయకులు, కమిటీ అధ్యక్షుడు ఎంఎస్ ఈశ్వరయ్య, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం.వీరాంజనేయులు, మాజీ కౌన్సిలర్ ఎం రామాంజనేయులు, మాజీ ఎంపీటీసీ జింకల సంజీవకుమార్, అనుంపల్లి శివ, రంగనాయకులు, గోపాలు, అంజి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గుత్తి, మండలంలోని తొండపాడు, బసినేపల్లి, పెద్దవడుగూరు, శింగనమల, నార్పల, గార్లదిన్నె మండలాల్లో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.


నార్పలలో వాల్మీకి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న వాల్మీకులు


తాడిపత్రిలో వాల్మీకి విగ్రహం వద్ద వేడుకలు నిర్వహిస్తున్న సజ్జలదిన్నె రాజు


గుత్తిలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆ సంఘం నాయకులు


గుత్తి మండలం బసినేపల్లిలో వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొన్న వాల్మీకి సంఘం నాయకులు

సంక్షిప్త సమాచారం

యువతి అదృశ్యం

యల్లనూరు: మండలంలోని కూచివారిపల్లిలో యువతి అదృశ్యంపై కేసు నమోదైట్లు మంగళవారం ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రామచంద్ర కుమార్తె శృతి ఈ నెల 4న తెల్లవారుజామున ఎవ్వరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెదికినా ఆచూకీ దొరకలేదు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విద్యార్థికి గాయాలు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని హంపయ్యకాలనీలో ఉన్న స్వామి వివేకానంద మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మధ్యాహ్నం వరండాలో కూర్చున్న రెండో తరగతి చదువుతున్న సుశాంత్‌ను మరో పిల్లాడు పరిగెత్తుకుంటూ వచ్చి గట్టిగా తగిలాడు. ఈ క్రమంలో సుశాంత్ కిందపడటంతో తలకు గాయమై తీవ్ర రక్తస్రావం జరిగింది. తల్లిదండ్రులు అందుబాటులో లేని కారణంగా బాలుడిని హెచ్‌ఎం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాలుడి తలకు మూడు కుట్లు పడ్డాయని హెచ్‌ఎం నామేనాయక్ తెలిపారు.

'పెరటి కోళ్ల పెంపకం లాభదాయకం'

బుక్కరాయసముద్రం: రైతులకు వ్యవసాయంతో పాటు పెరటి కోళ్ల ఎంతో లాభదాయకంగా ఉంటుందని సంయుక్త సంచాలకుడు డాక్టర్ ప్రేమచంద్ సూచించారు. మంగళవారం మండలంలోని రెడ్డిపల్లి ప్రాంతీయ పశు శిక్షణా కేంద్రంలో పెరటి కోళ్ల పెంపకంలో యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోళ్లు, పొట్టేళ్లు, గొర్రెల పెంపకం లాభదాయకంగా ఉంటుందన్నారు. కోళ్లు, గొర్రెలు, మేకల పెంపకంలో యాజమాన్య పద్ధతులపై వెటర్నీ పశు శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రారెడ్డి వివరించారు. అశ్వర్థప్ప, డిప్యూటీ డైరెక్టర్ రమేష్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్లు రత్నకుమార్, సుబ్రమణ్యం, రైతులు పాల్గొన్నారు.

ఊబిచెర్ల వద్ద పోలీసు చెక్‌పోస్టు

గుత్తి రూరల్: మండలంలోని ఊబిచెర్ల గ్రామ శివారులో జిల్లా సరిహద్దు వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై అంతర్ జిల్లా బార్డర్ చెక్‌పోస్టును పోలీసులు ఏర్పాటు చేశారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో ఊబిచెర్ల వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేసి వాహన తనిఖీలు చేస్తున్నారు. చెక్‌పోస్టు వద్ద ప్రత్యేక సిబ్బందిని నియమించారు. అక్రమ మద్యం, నగదు, ఇతర వస్తువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు సీఐ రామారావు తెలిపారు. మంగళవారం చెక్‌పోస్టును సీఐ తనిఖీ చేసి సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రతి వాహనాన్ని అపి క్షణ్ణంగా తనిఖీ చేసి జిల్లాలోకి అనుమతించాలని అదేశించారు.

మహాసభ కరపత్రాలు విడుదల

పామిడి: పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పామిడిలో నిర్వహించే ఆ మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం గౌరవాధ్యక్షుడు ఆర్.ముత్యాలు మాట్లాడారు. స్థానిక అంబేడ్కర్ భవనంలో ఈ నెల 12న ఉదయం 10 గంటలకు వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారంపై మహాసభ ఉంటుందన్నారు, వ్యవసాయ కార్మికులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు మల్లేసు, పీట్ల శివకుమార్, షాషు, ఉసేనప్ప, జయరాముడు, హరి పాల్గొన్నారు.